ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 2 ఫిబ్రవరి 2024

ముగిసిన జేఈఈ మెయిన్స్ పరీక్షలు

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 1: జాతీయస్థాయిలో ఐఐటీ, ఎన్ఐటీలో ప్రవేశాలకు గత నెల 24నుంచి ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న జేఈఈ మెయిన్స్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్ఐటీ) ఆధ్వర్యంలో జిల్లాలోని శ్రీశివానీ ఇంజనీరింగ్ కళాశాల(చిలకపాలెం), శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల(ఎచ్చెర్ల)లో ఈ పరీక్షలు నిర్వహించారు. గురువారం శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో 200 మంది అభ్యర్థులకు 195మంది, వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో 200మంది అభ్యర్థులకు 195 మంది పరీక్షలకు హాజరయ్యారు. మొత్తంగా ఆరు రోజుల్లో రెండు కేంద్రాల్లో 2,071 మందికి 2,036 మంది హాజరై పరీక్షలు రాశారు.

టీడీపీ సై

- ఎంపీ అభ్యర్థిని ఓకే చేసిన అధిష్ఠానం
- వైసీపీ లోక్‌సభ ఇన్‌చార్జిగా పేరాడ తిలక్
- అధికారికంగా ఖరారు కాని అభ్యర్థిత్వం
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఆశావహులు
- గ్రామాల్లో దూకుడు పెంచిన విపక్ష నేతలు
- సైకిల్ ఎక్కుతున్న అధికార పార్టీ నాయకులు

శ్రీకాకుళం లోక్‌సభ అభ్యర్థిని ఖరారు చేసిన టీడీపీ.. దూకుడు మరింత పెంచింది. కింజరాపు రామ్మోహన్ నాయుడును మళ్లీ బరిలో దింపాలని నిర్ణయించింది.

2014లో భారీమెజార్టీతో.. 2019లో వైసీపీ హవాలోనూ ఎంపీగా గెలిచిన రామ్మోహన్ నాయుడును ఎంపిక చేయడంతో వైసీపీలో కలవరపాటు మొదలైంది. వైసీపీ లోక్‌సభ ఇన్‌చార్జిగా ప్రస్తుతానికి పేరాడ తిలక్‌ను నియమించినా.. అధికారికంగా అభ్యర్థిత్వం ఖరారు కాలేదు. ఈయన ఎంపికను కొందరు సీనియర్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆ పార్టీకి ఎన్నికలకు ముందే ఓటమి భయం పట్టుకుంది. దీనికితోడు టీడీపీ నాయకులు గ్రామగ్రామానికి వెళ్తూ అధికారపార్టీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతున్నారు. జిల్లాలో వైసీపీ బలహీనపడుతున్నట్లు సంకేతాలు వస్తుండడంతో ఆపార్టీ నాయకులు సైకిల్ ఎక్కుతున్నారు. ఇది టీడీపీకి కలిసొచ్చే అంశమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)


ఎంపీ రామ్మోహన్ నాయుడు

సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గర పడుతోంది. ఈలోగా ప్రధాన రాజకీయపార్టీలు తీవ్ర కసరత్తు చేసి.. అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తున్నాయి. టీడీపీ, వైసీపీ..న శ్రీకాకుళం లోక్‌సభస్థానం అభ్యర్థులను దాదాపు ఖరారు చేశాయి. ఇప్పటికే రెండుసార్లు ఎంపీగా గెలుపొందిన కింజరాపు రామ్మోహన్‌నాయుడును టీడీపీ మళ్లీ బరిలో దింపనుంది. అలాగే వైసీపీ అధిష్ఠానం పేరాడ తిలక్‌ను ప్రస్తుతానికి లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రకటించింది. దీంతో ప్రధాన పార్టీల అభ్యర్థులెవరన్నది నిర్ధారణ అయిపోయింది. దివంగత కేంద్ర మాజీమంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు కింజరాపు ఎర్రన్నాయుడు అకాల మృతితో ఆయన తనయుడు రామ్మోహన్‌నాయుడు రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఎర్రన్నపై జిల్లా ప్రజల్లో ఉన్న అభిమానం.. రామ్మోహన్‌నాయుడు వాగ్ధాటితో ప్రజలను ఆకట్టుకున్నారు. తొలిసారిగా 2014లో ఎంపీగా పోటీచేయగా.. భారీమెజార్టీతో గెలుపొందారు. 2019లో వైసీపీ హవాలోనూ.. శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థిగా రామ్మోహన్‌కే జిల్లావాసులు మొగ్గు చూపించి గెలిపించారు. రామ్మోహన్‌నాయుడు కూడా అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకున్నారు. సిక్కోలు ప్రజల వాణిని పార్లమెంట్‌లో గళమెత్తడం.. ప్రత్యేక అంశాలను ప్రస్తావించి ప్రభుత్వ తప్పిదాలను ఎత్తిచూపడంలో రామ్మోహన్‌నాయుడికి గుర్తింపు లభించింది. దీంతో మూడోసారి కూడా సునాయాసంగా గెలుస్తారనే నమ్మకంతో టీడీపీ అధిష్ఠానం రామ్మోహన్‌నాయుడికి ఎంపీ టిక్కెట్ ఖరారు చేస్తూ జాబితా వెల్లడించింది.

వైసీపీలో అవే ఒడిదుడుకులు

వైసీపీలో 2014లో ప్రస్తుత పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి.. శ్రీకాకుళం పార్లమెంట్ స్థానానికి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2019లో ప్రస్తుత ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్.. వైసీపీ నుంచి ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచి ఓడిపోయారు. ఓట్ల లెక్కింపు సమయంలో కొన్ని గంటలపాటు ఉద్రిక్తత చోటుచేసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఓట్ల లెక్కింపు పూర్తయి.. వైసీపీ అధికారంలోకి వచ్చిందని ప్రకటించినా.. శ్రీకాకుళంలో పార్లమెంట్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపులో సందిగ్ధత వీడలేదు. అధికారంలోకి తమ పార్టీ వచ్చేసిందని.. ఎలా అయినా... రీకౌంటింగ్‌తో పాటు ఇతరత్రా అంశాలను లేవదీసి వివాదం చేద్దామని వైసీపీ నాయకులు యత్నించారు. కానీ అప్పటి కలెక్టర్ ఓట్ల లెక్కింపు విషయంలో గందరగోళం లేకుండా.. ప్రక్రియను సుదీర్ఘంగా.. సునిశితంగా పరిశీలించి ఎంపీగా రామ్మోహన్‌నాయుడు విజయం సాధించారని ప్రకటించారు. రాష్ట్రంలో జగన్ హవా అప్పట్లో ఓట్ల రూపంలో నడిచినా.. రామ్మోహన్‌నాయుడు విషయంలో ఆ ప్రభావం చూపలేకపోయింది. ఇప్పుడు అధికారపార్టీపై ప్రజల్లో ఉన్న భావన గురించి చర్చించాల్సిన పనిలేదు.


పేరాడ తిలక్

ఇదిలా ఉండగా.. 2019లో టెక్కలి అసెంబ్లీ వైసీపీ అభ్యర్థిగా పేరాడ తిలక్ పోటీ చేసి టీడీపీ అభ్యర్థి, మాజీమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడి చేతిలో ఓటమి చెందారు. టెక్కలి నియోజకవర్గంలో ఉన్న రెండు ప్రధాన సామాజిక వర్గాలు కూడా అచ్చెన్నవైపే మెజార్టీ చూపించారు. అచ్చెన్న చేతిలో ఓటమి చెందిన పేరాడ తిలక్‌కు ఇప్పుడు శ్రీకాకుళం వైసీపీ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా పార్టీ అధిష్ఠానం దాదాపు ఖరారు చేసేసింది. ఇప్పటికే టిక్కెట్ ఆశించి భంగపడిన వైసీపీ నాయకుల్లో ముఖ్యులు.. కేంద్ర మాజీమంత్రి కిల్లి కృపారాణి, ఇంకొంతమంది తిలక్ గెలుపు కోసం సహకరిస్తారా? లేదా? అన్నది చర్చనీయాంశమవుతోంది. తిలక్ సామాజిక వర్గం కూడా ఆయన వెనకుంటుందా? అన్న సంశయం నెలకొంది. గతం కన్నా.. పార్టీలో ఒడిదుడుకులు ఎక్కువగా ఉన్నాయి. స్వపక్షంలో బయటకి కనిపించని విపక్షం దాగుంది. ఏ విధంగా చూసినా.. వైసీపీ ఎంపీ అభ్యర్థికి ఏడు నియోజకవర్గాల్లోనూ ఆశించినస్థాయిలో మద్దతు లభించదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో రాజకీయ చర్చలు..

ఎన్నికల తేదీలు ప్రకటించనప్పటికీ.. గ్రామాల్లో మాత్రం చర్చలు అప్పుడే ఆరంభమయ్యాయి. జిల్లాలో గతంలో పరిస్థితి.. వైసీపీ పాలనలో దుస్థితిపై చర్చిస్తున్నారు. ప్రధానంగా రహదారులు అధ్వానంగా ఉన్నాయని.. పథకాల పేరుతో డబ్బుల పంపిణీ మినహా.. కొత్తగా అభివృద్ధి కార్యక్రమాలు లేవని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో కొంతమంది అధికారపార్టీపై వ్యతిరేకతను బయటపెడుతున్నారు. ఈ క్రమంలో టీడీపీకి మరింత ఆదరణ పెరుగుతోంది. మరోవైపు వైసీపీలో అభ్యర్థులు మార్పులు.. వరుస సర్వేలు.. రాష్ట్రంలో పలువురు ఎంపీలు ఆపార్టీని వీడటం.. అలాగే జిల్లాలో పలువురు వైసీపీ సానుభూతి పరులు టీడీపీలో చేరుతుండడం.. తెలుగుదేశానికి కలిసివస్తోంది. ఈ పరిణామాలు వైసీపీని మరింత ఇరుకున పెడుతున్నాయి.


హరిపురం : వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న గౌతు శిరీష

మందస ఏజెన్సీలో వైసీపీకి షాక్

- చీపి ఉప సర్పంచ్, ముగ్గురు వార్డు మెంబర్లతో పాటు 90 కుటుంబాలు టీడీపీలో చేరిక

హరిపురం: వైసీపీకి మంచి పట్టున్న మందస ఏజెన్సీలో భారీ షాక్ తగిలింది. చీపి పంచా యతీ డలసరి, పుట్టూరు, బొందికారి, కొండమేర, లొడకపిట్ట గ్రామాలకు చెందిన 90 కుటుంబాలు ఉప సర్పంచ్ కొడంగి భువని, వార్డు మెంబర్లు సవర రాముడు, సవర దుర్యోధన, సవర భీముడు ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. బొందికారి గ్రామంలో జరిగిన పల్లె పల్లెకు టీడీపీ కార్యక్రమంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారికి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైసీపీ నేతలకు అధికారం తప్ప గిరిజన పల్లెల్లో అభివృద్ధి చేయాలన్న ఆలోచన లేదన్నారు. టీడీపీ హయాంలోనే పల్లెలు అభివృద్ధి పథకంలో నడిచాయని, ప్రస్తుతం కనీసం రోడ్లు, నీరు కరవైన దుస్థితి నెలకొందని విమర్శించారు. మరలా టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లు, బ్రిడ్జి నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. టీడీపీలో చేరిన వారిలో సవర కామరాజు, టుకియా, కృష్ణ, సోమేశ్వరరావు, చింతా మణి, కాంతమ్మ, యశోద, కౌసల్య, వరలక్ష్మి, సుకుమారి, మాధవరావు తదితర 90 కుటుంబాల వారున్నారు. పార్టీలో చేరిన నేతలు మాట్లాడుతూ.. వైసీపీ నాయకులు హామీలే తప్ప ఐదేళ్లుగా ఎలాంటి అభివృద్ధి చేయలేదని, చంద్రబాబు, గౌతు శిరీషలపై నమ్మకంతోనే టీడీపీలో చేరుతున్న ట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, నాయకులు దాసరి తాతారావు, తమిరి భాస్కరరావు, రట్టి లింగరాజు, డొంకురు తిరుపతి, మహేష్, కర్రయ్య, రుద్రయ్య, నవీన్, సవర లఖియా తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, కార్పొరేషన్ కమిషనర్ తమీమ్ అన్సారియాకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న జేసీ నవీన్, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

జిల్లాకు చేరుకున్న కలెక్టర్

- కార్పొరేషన్ కమిషనర్ కూడా..

శ్రీకాకుళం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కొత్త కలెక్టర్, శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్ గురువారం రాత్రి జిల్లాకు చేరుకున్నారు. కలెక్టర్‌గా మన్‌జీర్ జిలానీ సమూన్, శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్‌గా.. ఆయన సతీమణి తమీమ్ అన్సారియా నియమితులైన విషయం తెలిసిందే. ఈ మేరకు వారిద్దరూ గురువారం శ్రీకాకుళం చేరుకోగా.. జిల్లా అధికారులు స్వాగతం పలికారు. జేసీ నవీన్, ఎస్పీ రాధిక, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధికారులు, జిల్లా సమాచార శాఖ అధికారులు కలెక్టర్‌ను, కమిషనర్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

సుడా వైస్ చైర్మన్‌గా ఓబులేసు

శ్రీకాకుళం అర్బన్, ఫిబ్రవరి 1: శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన చల్లా ఓబులేసును శ్రీకాకుళం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ(సుడా) వైస్ చైర్మన్‌గా నియమిస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

అప్రజాస్వామిక వైఖరి మారాలి

- బకాయిలను వెంటనే విడుదల చేయాలి
- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌కుమార్

అరసవల్లి, ఫిబ్రవరి 1: 'ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరి మారాలి. 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి. బకాయిలు తక్షణమే విడుదల చేయాల'ని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చౌదరి రవీంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద రెండో రోజు గురువారం రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 'ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ కూడా నెరవేర్చకపోగా.. ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించి అక్రమ కేసులు బనాయించడం సరికాదు. మెగా డీఎస్సీ ప్రకటిస్తామని చెప్పి.. చివరకు ఎన్నికల ముందు కేవలం 6000 పోస్టులకే పరిమితం చేయడం చాలా దుర్మార్గం. ఖాళీగా ఉన్న 30వేల పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయాల'ని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ హామీలను అమలు చేయాలని కోరితే ఉద్యోగులను నిర్బంధించడం అనాగరికమని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎల్.బాబూరావు, గౌరవాధ్యక్షుడు కె.వైకుంఠరావు, సహాధ్యక్షుడు కె.దాలయ్య, కోశాధికారి బి.రవికుమార్, జిల్లా కార్యదర్శులు బి.శంకరరావు, వై.వాసుదేవరావు, జి.నారాయణరావు, బ.గౌరీశ్వరరావు, బి.శారద, ఎంవీ.రమణ, హెచ్.అన్నాజీరావు, పూర్వ కార్యదర్శి బి.మోహనరావు, పి.అప్పారావు, కోదండరావు, నారాయణరావు, బి.గణపతిరావు, పి.ధర్మారావు, వైకుంఠరావు, డి.లక్ష్మీనారాయణ, ఈశ్వరరావు, చిన్నారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

- ఏపీటీఎఫ్ డిమాండ్


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సరస్వతి

కలెక్టరేట్, ఫిబ్రవరి 1: విద్యారంగం, మునిసిపల్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి దవళ సరస్వతి మాట్లాడుతూ 'సర్వీసురూల్స్ లేని కారణంగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టడం లేదు. దీనివల్ల అనేకమంది పదోన్నతులు పొందకుండానే పదవీ విరమణ అవుతున్నారు. తక్షణమే సర్వీస్‌రూల్స్ అమలు చేయాల'ని కోరారు. ఏపీటీఎఫ్ అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పీఎఫ్ ఖాతాలు తెరవాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సురేష్‌బాబు మాట్లాడుతూ జనాభాకు అనుగుణంగా పాఠశాలల సంఖ్య పెంచాలని, ఎంఈవో, డీవైఈవో పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు దాసరి రామ్మోహనరావు, చావలి శ్రీనివాస్, ఎస్.చాణక్య ఉపాధ్యక్షులు పి.అప్పలనాయుడు. జి.బీమారావు, రాష్ట్ర కౌన్సిలర్లు ఎస్‌వీ.అనిల్‌కుమార్, సదాశివుని శంకర్రావు, పైడి శ్రీరామ్మూర్తి, బి.చంద్రశేఖర్, రాజేష్ విజయకుమార్, టి.సూర్యనారాయణ, బి.రామకృష్ణ పాల్గొన్నారు.

వైసీపీలో ఫ్లెక్సీల రగడ

ఇచ్ఛాపురం రూరల్, ఫిబ్రవరి 1: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఫ్లెక్సీల ఏర్పాటులో భాగంగా వైసీపీలో వర్గవిభేదాలు బయటపడ్డాయి. నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త, జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ సంయుక్తంగా ఎన్నికల ప్రచార ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కాగా.. తిప్పనపుట్టుగ జంక్షన్, ఈదుపురం, బెల్లుపడలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను వైసీపీలో మరో వర్గానికి చెందిన కొంతమంది అసంతృప్తులు బుధవారం రాత్రి చింపివేశారు. దీంతో జడ్పీ చైర్‌పర్సన్ విజయ నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్న వ్యక్తుల పనేనని ఆమె వర్గం నాయకులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి పనులు చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఫ్లెక్సీల చింపిన వ్యక్తులు ఎవరో కనుగోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశామని ఈదుపురం జడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ తెలిపారు.


ఈదుపురంలో చించేసిన ఫ్లెక్సీ..



తిప్పనపుట్టుగ జంక్షన్ వద్ద..

ఎలుగుబంట్ల దాడి

- నలుగురికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం
- చికిత్స పొందుతున్న క్షతగాత్రులు
- కుక్కల సహకారంతో తప్పించుకున్న మరో యువకుడు


ఉద్దానంలో సంచరిస్తున్న ఎలుగుబంటి

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 1

వజ్రపుకొత్తూరు మండలం చీపురుపల్లి పంచాయతీలో ఎలుగుబంట్లు బీభత్సం సృష్టించాయి. గురువారం వేర్వేరు గ్రామాల్లో నలుగురిపై దాడి చేయగా.. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. కుక్కలు బిగ్గరగా అరవడంతో ఓ యువకుడు ఎలుగుల దాడి నుంచి తప్పించుకున్నాడు. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.


తీవ్రంగా గాయపడిన కుమారస్వామి, నారాయణమ్మ

- చీపురుపల్లి పంచాయతీ గడూరు గ్రామానికి చెందిన పిన్నాసి కుమారస్వామి(60), పిన్నాసి చలపతి గురువారం ఉదయం సముద్రంలో చేపలవేటకు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో మార్గ మధ్యంలో జీడి తోట వద్ద తల్లీ పిల్ల ఎలుగుబంట్లు కుమార స్వామిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆ సమయంలో చలపతితో పాటు అక్కడే ఉన్న కుక్కలు బిగ్గరగా అరవడంతో కుమార స్వామిని విడిచి ఎలుగుబంట్లు పారిపోయాయి. తర్వాత పిన్నాసి చలపతి.. స్థానికుల సహకారంతో కుమారస్వామిని చికిత్స నిమిత్తం ఆటోలో పలాసలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుక్కలు గట్టిగా అరవడంతో తాను ఎలుగుబంట్ల దాడి నుంచి బయటపడ్డానని చలపతిరావు తెలిపారు.


పలాసలో చికిత్స అందజేస్తున్నవైద్యులు

- డెప్పూరుకు చెందిన లైశెట్టి నారాయణమ్మ(65) తన జీడితోటలో కంచె వేస్తుండగా ఎలుగుబంట్లు దాడి చేశాయి. ఆమె తలపై తీవ్రంగా గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఆమెను పలాస ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆమెను విశాఖ తరలించారు.
- డెప్పూరుకు చెందిన శీలం తాతారావు, పోకల ఊర్మిళ కూలి పనులకు వెళ్తుండగా ఎలుగుబంట్లు దాడి చేసేందుకు ప్రయత్నించాయి. వారు బిగ్గరగా అరుపులు పెట్టడంతో అవి జీడితోటల్లోకి పారిపోయాయి. దాడి నేపథ్యంలో వారి చేతులపై స్వల్పగాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వెళ్లిపోయారు. జీడితోటలకు కంచె వేసేందుకుగానూ తాము చేతులకు గ్లౌజ్‌లు పెట్టుకుని వెళ్లడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డామని తాతారావు, ఊర్మిళ తెలిపారు. ఎస్ఐ మధుసూదనరావు, పారెస్టు అధికారులు ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. ఎలుగుదాడి ఘటనపై కేసు నమోదు చేశారు.

ఉద్దానంలో భయం.. భయం

ఉద్దానం వాసులు ఎలుగుబంట్ల దాడులతో భయం భయంగా జీవనం సాగిస్తున్నారు. ఒకప్పుడు కొండలు, గుట్టలు అడవులకే పరిమితమైన ఎలుగుబంట్లు.. ఇప్పుడు గ్రామాల్లోకి చొరబడి ప్రజలపై దాడి చేస్తున్నాయి ఇప్పటికే చాలామంది మృతి చెందగా.. కొందరు తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో బయటకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఉంది. గత ఏడాది వజ్రపుకొత్తూరు, కిడిసింగి గ్రామాల్లో ఎలుగు దాడి చేయగా ఐదుగురు మృతి చెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఇటీవల అక్కుపల్లికి చెందిన లోకనాథం కూడా ఎలుగుబంటి దాడిలో తీవ్రంగా గాయపడ్డారు. ఇలా తరచూ దాడులు జరుగుతూనే ఉన్నాయి. అటవీశాఖ అధికారులు అప్పుడప్పుడు మొక్కుబడిగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు తప్ప.. శాశ్వత పరిష్కారం చూపడం లేదని ఉద్దానం వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీరప్రాంతాల్లో మరింత పర్యవేక్షణ చేపట్టాలని, ఎలుగుల నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

కారణమేమిటంటే..

కొంతమంది నాయకులు తమ స్వార్థం కోసం కొండలను ఆక్రమించి.. అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. మరికొందరు రియల్‌ఎస్టేట్ పేరుతో తోటలు నరికేస్తున్నారు. దీంతో కొండలు, తోటల్లో నివాసాలు కరువై.. ఎలుగుబంట్లు గ్రామాల్లోకి వచ్చేస్తున్నాయని పర్యావరణ వేత్తలు పేర్కొంటున్నారు. ఇటీవల బాతుపురంలో అటవీశాఖాధికారులు ఏర్పాటు చేసిన సమావేశంలోనూ ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. అలాగే బాతుపురం పరిధిలో ఆరు ఎలుగుబంట్లు సంచరిస్తున్నట్టు సర్పంచ్ లక్ష్మీనారాయణ వెల్లడించారు. వాటి నుంచి తమకు రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సిబ్బంది కొరత వల్ల పూర్తిస్థాయి పర్యవేక్షణ చేపట్టలేకపోతున్నామని అటవీ అధికారులు పేర్కొంటున్నారు.

వైసీపీ పాలనలో ఒరిగిందేమీలేదు

● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 1: రాష్ట్రంలో గడచిన ఐదేళ్లలో వైసీపీ పాలనలో గ్రామాలకు ఒరిగిందేమీ లేదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గురువారం తర్లిపేట తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇటీవల అనేక గ్రామాల్లో పర్యటించానని, ప్రతి గ్రామంలోనూ సమస్యలున్నాయన్నారు. తాను మంత్రిగా ఉన్న ప్పుడు గ్రామా లకు చేసిన అభివృద్ధే తప్ప వైసీపీ ప్రభుత్వ కాలంలో ఒక తట్టెడు మట్టి ఎక్కడ వేసిన పాపాన పోలేదన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసుకుంటేనే మరలా సంక్షేమం, గ్రామాల అభివృద్ధి జరుగుతుందన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి అంశం తప్పనిసరిగా అమలు చేస్తామన్నారు. ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేసి టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు కింజరాపు హరివరప్రసాద్, బోయిన రమేష్, వెలమల కామేశ్వరరావు, విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, గొండు లక్ష్మణరావు, పూజారి శైలజ, బాడాన రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

యాదవులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

టెక్కలి/కోటబొమ్మాళి: టీడీపీ ఆవిర్భావం నుంచి యాదవులంతా ఆ పార్టీకి అండగా ఉన్నా మని, ఈసారి రాజకీయ ప్రాధాన్యం ఉన్న పదవులను ఇవ్వాలని యాదవ సాధికారిత సమితి జిల్లా కన్వీనర్ ఇప్పిలి జగదీష్ కోరారు. గురువారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నా యుడును నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో సంఘ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. యాదవులకు బీసీ-డీ నుంచి బీసీ-బీకి మార్చాలని, యాదవుల పిల్లలు చదువుకునేందుకు



అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న యాదవ సంఘ నాయకులు

ప్రోత్సాహం అందజేయాలని కోరారు. యాదవ సాధికారిత సమితి భవన నిర్మాణాలకు స్థలాలు కేటాయించాలని, మూగజీవుల పశుగ్రాసం నిల్వల కోసం షెడ్లు వేయించాలని, 50 ఏళ్లు దాటిన తప్పెటగుళ్ల కళాకారులకు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు.

భవిష్యత్ కోసం టీడీపీని గెలిపించండి

నరసన్నపేట: రాష్ట్రంలోని యువత, కార్మికుల భవిష్యత్ కోసం రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. గురువారం పట్టణంలోని ఆదివారం పేట, లచ్చుమన్నపేట తదితర ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహించారు. భవన నిర్మాణ రంగ కార్మికులతో మాట్లాడుతూ.. టీడీపీ-జనసేనకూటమికి ప్రతి ఒక్కరు మద్దతివ్వాలని కోరారు. ఇసుక, సిమెంట్ ధరలు పెంచి కార్మికుల పొట్ట కొట్టిన వైసీపీ ప్రభుత్వానికి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గొద్దు చిట్టిబాబు, బోయన ఆనంద్, ఉణ్న వెంకటేశ్వరరావు, చింతు రమణ, కానురు శివ, బెవర రాము, బోయన సతీష్, పీస కృష్ణ, తాళాభక్తుల గోవిందరావు, గొలివి గణేష్, దంత త్రినాథరావు, తంగి తారకేశ్వరరావు, పాల్గొన్నారు.

హరిపురం: భావితరాల భవిష్యత్తుకు బాబుతోనే గ్యారెంటీ లభిస్తుందని టీడీపీ నాయకుడు దాసరి తాతారావు అన్నారు. కొత్తపల్లి పంచాయతీలో గురువారం పల్లెపల్లెకు టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ అందిస్తున్న గ్యారెంటీలను వివరించారు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోపీనాథ్ మహంతి, సాలిన మాదవరావు, కొండపల్లి నారాయణరావు, జుత్తు అమ్మినాయుడు, మరళీచౌదరి పాల్గొన్నారు.

జలుమూరు: తెలుగుదేశంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల యువత అధ్యక్షుడు గుండ రామకృష్ణ అన్నారు. రావిపాడు గ్రామంలో గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ వైఫల్యాలను, టీడీపీ మేనిఫెస్టోను



నరసన్నపేట: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి





జలుమూరు: రావిపాడు, సారవకోట మండలం లక్ష్మీపురంలో భవిష్యత్తు గ్యారెంటీ నిర్వహిస్తున్న నేతలు

ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుండ ఆదెమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జలుమూరు (సారవకోట): వైసీపీ పాలనలో రాష్ట్రం రావణ కాష్టంగా మారిందని టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. లక్ష్మీపురం గ్రామంలో గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమిని గెలిపించాలని కోరారు. శిమ్మ భాస్కరరావు, గొటివాడ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మునిసిపాలిటీలోని 21వ వార్డు గొల్లవీధిలో గురువారం బాబుష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ తెలుగు యువత అధ్య క్షుడు కాళ్ల జయదేవ్ మాట్లాడుతూ చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు.

ఆమదాలవలస: మునిసిపాలిటీలోని జూనియర్ కాలేజ్ సమీపంలో టీడీపీ జిల్లా న్యాయ విభాగం నాయకుడు తమ్మినేని విద్యాసాగర్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో జగన్‌రెడ్డి ఓటమి ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు.

జి.సిగడాం: పున్నాం పంచాయతీ పరిధిలో ఎల్లయ్యపేటలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మండలాధ్యక్షుడు కుమరాపు రవికుమార్ మాట్లాడుతూ.. చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్ సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జోగినాయుడు, అశోక్ పాల్గొన్నారు.





జి.సిగడాం, ఆమదాలవలసలో బాబు ష్యూరిటీ నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

శిరీషను విమర్శించే స్థాయి తిలక్‌కు లేదు

పలాస: టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషను విమర్శించే స్థాయి వైసీపీ పార్లమెంటరీ ఇన్‌చార్జి పేరాడ తిలక్‌కు లేదని టీడీపీ నాయకులు అన్నారు. గురువారం 27వ వార్డులో 'వార్డుకు పోదాం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ.. టీడీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. అనంతరం వార్డులో పర్యటించి టీడీపీ అమలు చేయనున్న పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, యవ్వారి మోహనరావు, జోగ మల్లి, శంకర్, నవీన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కామేశ్వరరావు

విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్

పలాస: విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అని, ఆయన ముందు చూపుతోనే రాజధాని అమరావతిగా తీర్చిదిద్దారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయం ఆవరణలో ఆ పార్టీ ప్రొఫెషనల్ వింగ్ ఆధ్వర్యంలో విద్యావంతులు, మేధావులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మేధావుల ప్రశ్నలకు రవికుమార్‌తో పాటు రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష సమాధానాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముందు చూపుతో అమరావతిని నిర్మిస్తే వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో తాత్సారం చేసిందన్నారు. గౌతు శిరీష మాట్లాడుతూ.. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాపాలన టీడీపీ హయాంలోనే సాగిందని, వైసీపీ పాలనలో ప్రజలు సంతృప్తిగా లేరన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్, జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, టంకాల రవిశంకర్‌గుప్తా, శాసనపురి మురళీకృష్ణ, గురిటి సూర్యనారాయణ, దువ్వాడ హేమబాబుచౌదరి, సూరాడ మోహనరావు, తలగాన నర్సింహమూర్తి, మల్లా శ్రీనివాస్, కోనేరు ఆదినారాయణరావు పాల్గొన్నారు.

పాదయాత్రకు సంఘీభావం

కాశీబుగ్గ: తెలగ కులస్థులకు బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ ఉత్తరాంధ్ర తెలగ కుల సంఘం అధ్యక్షుడు పల్లంట్ల వెంకటరామారావు చేపట్టిన పాదయాత్రకు టీడీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. గురువారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గౌతు శిరీష సంఘీభావం తెలిపి మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలో ఉండగా తెలగ కుల స్థులకు ఐదు శాతం రిజర్వేషన్ కూడా కల్పించిందని, ఎన్నికల్లో మరలా అధికారంలోకి వస్తే తెలగ కులస్థులను బీసి జాబితాలో చేరుస్తామని హామీ ఇచ్చారు. ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకు ఆయన చేపట్టిన పాదయాత్ర గురువారం పలాస కాశీబుగ్గలో కొనసాగింది. మొగిలిపాడు వద్ద వరకు సాగింది. కార్యక్రమంలో సంఘం సభ్యులు వాసు, అప్పారావు, లోకు, ప్రతాప్, గిరి, గోవింద్, రమేష్ కామేష్, జీవీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం

పలాసరూరల్: బ్రాహ్మణతర్లా చాకలివీధిలో టీడీపీ కార్యాలయాన్ని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష గురువారం ప్రారంభించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణ్‌కుమార్, నాయకులు పీరికట్ల విఠల్‌రావు, వడ్డి యాదగిరి, రఘుపాత్రుని సుదర్శనరావు, ఎర్ర వెంకటరావు, కొవ్వూరు ధర్మారావు, పొందర సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

డిపాజిట్లు చెల్లించాలని సహారా బాధితుల ధర్నా



ర్యాలీ చేపడుతున్న సహారా బాధితులు

నరసన్నపేట: తాము సహారా ఇండియాలో దాచుకున్న డిపాజిట్లను చెల్లించాలని కోరుతూ బాధితులు గురువారం పట్టణంలో ధర్నా నిర్వహించారు.సహారా కార్యాలయం నుండి పాతబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి వెంటనే డిపాజిట్లను చెల్లించి ఆదుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో గోపాలరావు, పెంటబాబు ఏజెంట్లు, బాధితులు పాల్గొన్నారు.

పాతపట్నంలో...



పాతపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న సహారా బాధితులు

పాతపట్నం: తాము దాచుకున్న డిపాజిట్లను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సహారా ఖాతాదారులు గురువారం ర్యాలీ నిర్వహించారు. దుర్గమ్మగుడి కాలనీ నుంచి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ చేపట్టి నినాదాలు చేశారు. సంస్థకు చెందిన హైదరాబాద్ జోనల్ మేనేజర్ రావిపాటి రామ కోటేశ్వరరావు, శ్రీకాకుళం రీజనల్ మేనేజర్ బరాటం లక్ష్మణరావు కొందరు పేద గిరిజనుల ద్వారా ఇప్పటికీ కొత్త వ్యాపారం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా 16న దేశవ్యాప్త సమ్మె



నినాదాలు చేస్తున్న కార్మిక, ప్రజాసంఘాల నాయకులు

టెక్కలి: కార్మిక, కర్షక, ఉద్యోగ, ప్రజావ్యతిరేక విధానాలు అనుకరిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 16న దేశ వ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని కార్మిక, ప్రజాసంఘాల నాయకులు కోరారు. గురువారం తొలుసూరుపల్లి రోడ్డులోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖరావు, దళిత హక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షుడు పాల పోలారావు విలేకరులతో మాట్లాడుతూ.. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అందించాలని, నాలుగు లేబర్ కోడ్స్, విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిట్టి సింహాచలం, తమిరె భుజంగరావు, సామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాగర సంగ్రామ దీక్షను విజయవంతం చేయాలి

సంతబొమ్మాళి: సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 4న విశాఖ జీవీఎంసీ ఎదురుగా నిర్వహించనున్న సాగర సంగ్రామ దీక్షను విజయవంతం చేయాలని ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా గౌరవాధ్యక్షుడు రెడ్డి సూరిబాబు కోరారు. గురువారం దీక్షకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సీపీఎస్‌ను రద్దు చేయిస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ జీపీఎస్‌ను తీసుకువచ్చి ఉద్యోగులకు అన్యాయం చేశారన్నారు. దీనికి నిరసనగా ఓట్ ఫర్ ఓపీఎస్ పేరుతో చేపడుతున్న సాగర సంగ్రామ దీక్షలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు పి.ఫల్గుణరావు, సభ్యులు చంద్రుడు, వెంకటమణ, రామారావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్ తీసుకురావడం దారుణం

జలుమూరు: ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేస్తే ప్రభుత్వం జీపీఎస్ తీసుకురావడం దారుణమని ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా అధ్యక్షుడు మెండ రామారావు అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సాగర సంగ్రామ దీక్ష పోస్టర్లను ఆవిష్కరించారు. గత ఎన్నికలకు ముందు ఓపీఎస్ పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ ఆ హామీని తుంగలో తొక్కారని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఓట్ ఫర్ ఓపీఎస్ నినాదంతో విశాఖలో 4వ తేదీన నిర్వహిస్తున్న సాగర సంగ్రామ దీక్షలో ప్రతీ ఉద్యోగి పాల్గొని నిరసనను తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.సత్యం, డీటీ పి.శ్రీనివాసరావు, ఆర్ఐ సతీష్, సీఎస్‌టీడీ గణేష్, మండలశాఖ అధ్యక్షుడు పట్టి సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి.చంద్రభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం మార్చండి

● లేకుంటే చట్టపరమైన చర్యలు: మునిసిపల్ చైర్మన్


పలాస, ఫిబ్రవరి 1: పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ 24వ వార్డులో ఉన్న ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి నూతన గదుల ప్రారంభోత్సవంలో తనకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని మునిసిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ప్రభుత్వ ఆసుపత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శిలాఫలకంలో తన పేరును ఉద్దేశపూర్వకంగానే వెనుక పెట్టారని, దీని ని సరిచేసి, కొత్త శిలాఫలకం ఏర్పాటు చేయాలని, లేకుంటే తాను చట్టపరంగా చర్యలు తీసు కుం టానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా హాజరుపట్టీని పరిశీలించారు. అయితే 11 మంది వైద్యా ధికారులు ఉండాల్సి ఉండగా పలువురు వైద్యులు బయట పనుల నిమిత్తం వెళ్లడంపై ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. మునిసిపాలిటీ ప్రథమ పౌరుడినని, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా ఉన్న తనకు గడచిన మూడేళ్లలో గుర్తింపు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆసుపత్రి అభివృద్ధి నిధుల ఖర్చుల వివరాలను సహచట్టం ద్వారా తెలుసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. రెండు రోజుల కిందట మంత్రి అప్పలరాజు ఆసుపత్రి అదనపు భవనాలను ప్రారంభించిన సందర్భంగా చైర్మన్ పేరు వెనుక వరుసలో ఉండడాన్ని గుర్తించి ఆయన ప్రశ్నించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆసుపత్రిని సందర్శించి అందులో ఉన్న లోపాలు ప్రజలకు బహిర్గతం చేసేందుకు చైర్మన్ చర్యలు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి.



వైద్యాధికారుల హాజరుపట్టీని పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు

ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ

పాతపట్నం: బస్సులో దొరికిన పర్సును సంబంధిత వ్యక్తికి అందించి ఆర్టీసీ సిబ్బంది నిజాయితీని చాటుకున్న ఘటన గురువారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. పలాస నుంచి కొత్తూరు వైపు వెళుతున్న పలాస డిపో ఆర్టీసీ బస్సులో పాతపట్నం వస్తున్న కె.శ్రీధర్ తన పర్సును పోగొట్టుకున్నాడు. వెనుక సీట్‌లో కూర్చొని ఉండగా గతుకుల రోడ్డు వల్ల బస్సు కుదుపులకు పర్సు జారి పోయింది. ఆ తరువాత పర్సు పోయిందని గుర్తించి ఆర్టీసీ కంట్రోల్‌రూం సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. ఇదిలా ఉండగా బస్సులో పర్సును గుర్తించిన కండక్టర్ టీటీ రావు, డ్రైవర్ పీఎస్ చలం పర్సును భద్రపరిచి కొత్తూరు నుంచి తిరుగు ప్రయాణంలో సదరు శ్రీధర్‌కు అందజేశారు. పర్సులో రూ.6400 నగదు, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డులున్నాయి. పర్సు దొరకడంతో శ్రీధర్ ఆనందం వ్యక్తంచేసి ఆర్టీసీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



శ్రీధర్‌కు పర్సును అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

జీడి పంట గిట్టుబాటు ధరపై పార్లమెంట్‌లో ప్రస్తావించాలి

కాశీబుగ్గ: జీడి పంట గిట్టుబాటు ధరపై పార్లమెంట్‌లో ప్రస్తావించాలని వామపక్ష నాయకులు చాపర వేణుగోపాల్, మాధవరావు, రామారావు కోరారు. గురువారం సీపీఐ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లాతో పాటు ఏడు జిల్లాల్లో జీడిపంట విస్తారంగా పండుతుందన్నారు. ఉద్దానం, ఏజెన్సీ ప్రాంతంలో ఈ పంట ప్రజలకు జీవనాధారమన్నారు. పలాస-కాశీబుగ్గ పరిసర ప్రాంతాల్లో 1300 కుటీర పరిశ్రమలు నడుస్తున్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా 1200 వరకు ఉన్నాయన్నారు. జీడి రైతులు గిట్టుబాటు లేక తీవ్ర ఇబ్బందులు, నష్టాలను చవిచూస్తున్నారన్నారు. దళారుల బారిన పడకుండా రైతులకే గిట్టుబాటు వచ్చేలా, వీరి సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించి న్యాయం చేయాలని ఎంపీల ను కోరారు. ఈ కార్యక్రమంలో భీమారావు, ఈశ్వరి, వాసు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు పూజిత



టెక్కలి: హిమాచల్ ప్రదేశ్‌లో ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు ఐతం కళాశాల విద్యార్థిని హడ్డుబంగి పూజిత ఎంపికైందని డైరెక్టర్ ప్రొఫెసర్ వీవీ నాగే శ్వరరావు తెలిపారు. ఇటీవల నన్నయ యూనివర్శిటీలో జరిగిన సౌత్‌జోన్ మహిళా విభాగంలో పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. పూజితను డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, హెచ్‌వోడీ ప్రసన్న, స్పోర్ట్స్ కన్వీనర్ మురళీధర్, పీడీలు లక్ష్మణ మూర్తి, మురళీ మోహన్, తేజేశ్వరి, వెయిట్‌లిఫ్టింగ్ కోచ్ వెంకటేష్ అభినందించారు.

బోసిపోయిన వెలుగు కార్యాలయం



నందిగాం: ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ వెలుగు సీసీలు ఓ వైపు సమ్మె చేపడుతుండగా, మరోవైపు సీఎఫ్‌లు కూడా నిరసనల్లో పాల్గొనడంతో గురువారం నందిగాం వెలుగు కార్యాలయం బోసిపోయింది. కంప్యూటర్ ఆపరేటర్, అకౌంటెంట్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

నందిగాం: నందిగాం జాతీయరహదారిపై గురువారం వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. ఎస్ఐ మహ్మద్ అమీర్ ఆలీ ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. హెల్మెట్, లైసెన్స్ తదితర ధ్రువ పత్రాలు లేని వాహన చోదకుల నుంచి అపరాధ రుసుం వసూలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. రహదారి నిబంధనలు పాటించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పలాసరూరల్: బ్రాహ్మణతర్లా విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పలాస విద్యుత్ శాఖ ఈఈ జి.ప్రసాదరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గొప్పిలి ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించనున్నందున నారాయణపురం, కేసుపురం, టెక్కలిపట్నం, పెదంచల, కేదారిపురం, రాజ గోపాలపురం, టెక్కలిపట్నం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో స్లీపర్ క్లాస్ బోగీలు పెంచాలి

సంతబొమ్మాళి: భువనేశ్వర్-సికింద్రాబాద్ మధ్య ప్రతి రోజూ నడిచే విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో స్లీపర్ క్లాస్ బోగీలను పెంచాలని సికింద్రాబాద్ దక్షిణ మధ్య రైల్వే జీఎంకు బోరుభద్రకు చెందిన సామాజిక కార్యకర్త గొనప అప్పన్న గురువారం లేఖ రాశారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి వేలాది మంది నిత్యం సికింద్రాబాద్‌కు ప్రయాణిస్తుంటారని, ఈ రెండు జిల్లాల ప్రజలకు ఈ రైలు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. ఈ రైలులో గతంలో స్లీపర్ క్లాస్‌లో పది బోగీలుండేవని, ప్రస్తుతం మూడు బోగీలకు కుదించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

తల్లిదండ్రులు లేని పిల్లలకు అండ

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ తల్లిదండ్రులు లేని పిల్లలకు అండగా ఉంటామని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సూర్యప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక బోర్డు ఉన్నత పాఠశాలలో ఎస్వీసీటీ, కాకినాడకు చెందిన పడాల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిరాదరణ కు గురైన పిల్లల గుర్తింపు కార్యక్రమం నిర్వహించారు. ఇటువంటి వారిని గుర్తించి వారికి విద్య, వైద్య సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస రావు, రమేష్, రామారావు, కరుణశ్రీ, దివ్య, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

నరసన్నపేట: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో యువతకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ కార్యక్ర మాలను ఉచితంగా ఇస్తున్నట్లు సమితి జిల్లా కన్వీనర్ లింగరాజు తెలిపారు. స్థానిక బొడ్డవలస సత్యసేవాసమితి ఆధ్వర్యంలో గురువారం మగ్గం నేతపై శిక్షణను ప్రారంభించారు. జిల్లాలో టైలరింగ్, టీవీ, ఫ్రిజ్‌ల మరమ్మతులపై శిక్షణ ఇవ్వనున్నామన్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని మహిళ మృతి

కోటబొమ్మాళి: హరిశ్చంద్రపురం రైల్వేఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో గుర్తుతెలియని మహిళ గురువారం రైలు కిందపడి మృతి చెందింది. జీఆర్పీ పోలీసులు, స్థానికుల కథనం మేరకు... సుమారు 55 నుంచి 60 సంవత్సరాలు వయస్సు గల మహిళ తెల్లని చాయ కలిగి నీలిరంగు చీర ధరించి ఉంది. టెక్కలి నుంచి ఒడిశా మధ్య గల ప్రాంతానికి చెందిన మహిళ కావచ్చు.ఆమె కుడిచేయి విరగడం వల్ల పిండికట్టు వేసిఉంది.చీరకట్టు విధానం ఆధారంగా ఒరియా బ్రాహ్మణ మహిళగా భావిస్తున్నారు. ఉదయం ఏడుగంటల సమయంలో విశాఖపట్నం నుంచి పలాస వైపు వెళ్లే గుర్తుతెలియని రైలు కిందపడినట్లు తెలు స్తోంది. సమాచారం తెలుసుకున్న జీఆర్పీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పలాస ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేశారు.

ఎలక్ట్రికల్ బైక్ దగ్ధం

కంచిలి: కేసరిపడ గ్రామానికి చెందిన కప్పల సోమయ్య ఇంటి దగ్గర ఉన్న ఎలక్ట్రికల్ బైక్‌ను కొంతమంది దుండగులు గ్రామ పొలిమేరలోని పొలాల్లోకి తీసుకువెళ్లి దగ్ధంచేశారు. అలాగే అంపురం జంక్షన్ వద్ద నుంచి కేసరిపడ గ్రామానికి వచ్చే కేబుల్ లైన్ వైర్లను మధ్య మధ్యలో కోసి ధ్వంసంచేశారు. ఆ గ్రామానికి చెందిన ఓవ్యక్తి భూతగాదాలో విషయంలో కొందరు పెద్ద మనుషులుగా వ్యవహరించారు. ఈనేపథ్యంలో పెద్దమనుషులుగా వ్యవహరించిన వారికి సంబంధించిన ఆస్తులు ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బాధితుల ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని కంచిలి ఎస్ఐ బాలరాజు, క్లూస్ టీం సభ్యులు వేణు, పీసీ బాబురావు పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎనిమిది మందిపై కేసు నమోదు

మెళియాపుట్టి: మండలంలోని వసుంధరలో బుధవారం రాత్రి జరిగిన తగాదాలో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి.రాజేష్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. ముత్యాల పోలమ్మ గుడి నిర్మాణంలో ఇరువర్గాల మధ్య జరిగిన వివాదంలో గ్రామానికి చెందిన జానం లక్ష్మీపతిపై అదే గ్రామానికి చెందిన ఎస్.వినోద్, ఎస్.వెంకట్రావ్, బాడాన రాజేష్, బాడన కృష్ణ, బొచ్చు శరత్, తులసి తేజేశ్వరరావు,సలాన మహేష్, సలాన పృథ్వి దాడి చేశారు. ఈ నేపథ్యంలో గురువారం టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి, సీఐ నల్లి సాయి గ్రామంలో పర్యటించి వివరాలు సేకరించారు. ఎన్నికల నేపథ్యంలో వివాదాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

టెక్కలి రూరల్: స్థానిక ఆదిఆంధ్రా వీధి సమీపంలో హైవేపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు పలాస నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న లారీ ముందు వెళ్తున్న మరో లారీని ప్రమాదవశాత్తు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో వెనుక నుంచి ఢీకొన్న లారీ డ్రైవర్‌గా ఉన్న లుఖ్మన్ ఖాన్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈయన హర్యానా రాష్ట్రం మెవాత్ జిల్లా పునహన ప్రాంతానికి చెందినవాడు. లారీ క్యాబిన్‌లో ఇరుక్కున్న లుఖ్మన్ ఖాన్‌ను హైవే సిబ్బంది బయటకు తీసి చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. దీనిపై టెక్కలి పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె

సోంపేట: కుమార్తె తండ్రికి తలకొరిపెట్టి అంతిమ సంస్కారాలు నిర్వహించిన సంఘటన తాళ్లభద్ర జరిగింది. గ్రామస్థుల కథనం మేరకు... సొంపేట మండలంలోని తాళ్లభద్రకు చెందిన సారి కూర్మయ్య (75) గురువారం మృతిచెందాడు. చాలా ఏళ్ల కిందట కూర్మయ్య భార్యకూడా మృతి చెందింది. నలుగురు కుమార్తెలకు గాను ముగ్గురికి వివాహం జరగడంతో అత్తవారి ఇళ్లకు వెళ్లిపోయారు. రెండోకుమార్తె జానకి తండ్రి చేదోడుగా ఉంటోంది. ఈ నేపథ్యంలో తండ్రి మృతి చెందడంతో తలకొరివి పెట్టింది.



తలకొరి పెడుతున్న కుమార్తె జానకి

స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం

ఆమదాలవలస : ఆమదాలవలస మునిసిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న ఓప్రైవేట్‌స్కూల్ బస్‌కు గురువారం ఉదయం పెనుప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల కథనం మేరకు.. పట్టణానికి చెందిన కొంతమంది విద్యార్థులతో వెళ్తున్న బస్సు స్కూల్ సమీపంలో మరో ఇద్దరు విద్యార్థులను ఎక్కించుకోవడానికి ఏబీ రోడ్డు పక్కన ఆపారు. ఆ సమయంలో శ్రీకాకుళం నుంచి కొత్తూరు వెళ్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసు బస్సు ఆగిఉన్న స్కూల్ బస్సును వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా స్థానికులతో పాటు, బస్సులో ఉన్న విద్యార్థులు భయాందోళనతో కేకలువేశారు. అయితే బస్సులోఉన్న విద్యార్థులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో స్కూల్ యాజమాన్య ప్రతినిధులతోపాటు, విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

ఇంధన సామర్థ్యం పెంచుకోవాలి

ఎచ్చెర్ల: ఇంధన వినియోగం మేరకు సామర్థ్యం పెంచుకోవాలని కాలిఫోర్నియా(యూఎస్ఏ) ఎనర్జీ కమిషనర్, వైస్ చైర్మన్ గుండ శివ పిలుపునిచ్చారు. గురువారం శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల(ఎచ్చెర్ల)లో ఎనర్జీ మేనేజ్‌మెంట్, ఆడిట్ అన్న అంశంపై సదస్సు నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ సంప్రదాయ ఇంధనాల వినియోగంతోనే కాలుష్య నివారించవచ్చని తెలిపారు.కాలుష్యాన్ని నియంత్రించేలా ఇంధన తయారీ ఉండాలన్నారు. సోలార్, విండ్, తరంగ ఇంధన తయారీ ఆవశ్యకతను,ఇండియా, యూఎస్ఏల్లో అమలవుతున్న ఎనర్జీ పాల సీలను వివరించారు. కార్యక్రమంలో కిశోర్, రమణ మూర్తినాయుడు, చిట్టిబాబు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు: ఎస్ఐ

జి.సిగడాం:నిబంధనలు పాటించనివారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ సామంతులరామారావు హెచ్చరించారు. గురువారం జి.సిగడాంలో వాహనాలు తనిఖీచేశారు.ఆయనవెంట ఎస్ఐ రామకృష్ణ, హెచ్‌సీ కృష్ణారావు ఉన్నారు.

కాలువల్లోచెత్త.. దోమలు స్వైరవిహారం

ఆమదాలవలస: పట్టణంలోని కొత్తకోటవారివీధి లోగల మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ కాలువల నిర్వహణపై అధికారులు దృష్టి సారించకపోవడంతో రోజుల తరబడి చెత్తనిల్వఉంటోంది. కొన్నిచోట్ల కాలువలు పావడంతో రోడ్డుపైకి మురుగునీరుచేరుతోంది. వేంకటేశ్వర కళ్యాణ మండపం వద్ద చెత్తకుండిని ఏర్పాటుచేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో రోడ్డుపై చెత్త వేయాల్సివస్తోందని పలువురు వాపోతున్నారు. పారిశుధ్య కార్మికులు సమ్మె విరమించినప్పటి నుంచి చెత్తను సేకరించడానికి సిబ్బంది రావడం లేదని చెబుతున్నారు. సిబ్బంది చెత్తను సేకరించి కాలువలను శుభ్రం చేయాలని కోరుతున్నారు.



కొత్తవారివీధిలోని కాలువలో పేరుకుపోయిన మురుగు

అంబేడ్కర్ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

హరిపురం/పాతపట్నం:మందస మండలం రాధాకృష్ణపురం, పాతపట్నంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల, పాఠశాలల్లో ఐదు, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాళ్లు ఎల్.లక్ష్మి, ఆర్‌పీ కృష్ణతార వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మార్చి 10న ఉదయం ఐదు, మధ్యాహ్నం ఇంటర్ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు.

ప్రణాళికాబద్ధంగా బోధించాలి: డిప్యూటీ డీఈవో

సంతబొమ్మాళి: ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన చేయాలని టెక్కలి డిప్యూటీ డీఈవో జి.పగడాలమ్మ అన్నారు.గురువారం దండుగోపాలపురం జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న డీవోటీ పరీక్షల తీరును పరిశీలిచారు. ఇంటరాక్టివ్ ప్లాట్ ప్యానల్ పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి, ఎలా టైంటేబుల్ వేసుకొని చదవాలో విద్యార్థులకు వివరించారు. అనంతరం మధ్యాహ్నం భోజనం పరిశీలించారు.కార్యక్రమంలో హెచ్‌ఎం చైతన్య పాల్గొన్నారు.

వైసీపీ పాలన అవినీతిమయం

● ఎమ్మెల్యే బెందాళం అశోక్

ఇచ్ఛాపురం: వైసీపీ పాలన అవినీతిమయమయ్యిందని ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తుందని తెలిపారు. గురువారం ఇచ్ఛాపురంలో వేర్వేరు చోట్ల రజకులు, చంద్రశేఖర తాపీమేస్త్రీ, ఎలక్ట్రిషియన్ యూనియన్లతో సమావేశాలు ఏర్పాటుచేశారు.ఈసందర్భంగా అశోక్‌మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిపేదవాడు ఆర్థికంగా, వ్యాపారపరంగా వెనుకబడిపోయారన్నారు.తమపార్టీ అధికారంలోకిఉన్న సమయంలోఅన్ని సంఘాలకు కమ్యూనిటీ హాళ్ల మంజూరు చేశామని గుర్తుచేశారు. ఒక్క చాన్స్ అని చెప్పి జగన్‌రాష్ట్రాన్ని నాశనం చేశారని ఆరోపించారు. వైసీపీపాలనలో పరి శ్రమలు వెళ్లిపోయాయని ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు నందికి జాని, రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ కొండా శంకరరెడ్డి, ఆశి లీలారాణి, ఆశి జీవులు రెడ్డి, ఎన్.కోటి, డి.విశ్వనాధంరెడ్డి, రంగాల శ్రీను, దొరబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

తైక్వాండో పోటీలకు రిఫరీగా గౌతమ్

శ్రీకాకుళం స్పోర్ట్స్: శ్రీకాకుళానికి చెందిన మజ్జి గౌతమ్ చత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ శుక్రవారం నుంచి నిర్వహిస్తున్న 37వ జాతీయ సబ్‌జూనియర్ కోర్గీ, 12వ జాతీయ సబ్‌జూనియర్ పూమ్‌సే తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలకు రిఫరీగా నియమితులయ్యారు. ఈ మేరకు తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యదర్శి నుంచి నియామక ఉత్తర్వులు అందాయి. ఈసందర్భంగా మజ్జిగౌతమ్‌ను కలెక్టర్ శ్రీకేష్ లాఠ్కర్ గురువారం అభినందించారు. గౌతమ్‌ను శ్రీకాకుళం జిల్లా తైక్వాండో సంఘం ప్రతినిధులు తైక్వాండో శ్రీను, నౌపడ విజయ్‌కుమార్, వైశ్యరాజు మోహన్, గిడుతూరి వెంకటేశ్వరరావు, ఎం.సుధీర్ వర్మ, బి.రాజా, కంఠవేణు, జి.ప్రసాద్, వి.శ్రీనివాసరావు అభినందించారు.

వాలీబాల్‌లో సత్తాచాటిన విద్యార్థినులు

సరుబుజ్జిలి: రొట్టవలస పాఠశాల విద్యార్థినులు ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో భాగంగా నిర్వహించిన వాల్‌బాల్ పోటీల్లో సత్తాచాటారు. ఇటీవలనియోజకవర్గస్థాయిలో ప్రథమస్థానంసాధించగా, తాజాగా జిల్లా స్థాయిలో రన్నర్‌గా నిలిచారు.ఈ మేరకు విద్యార్థినులకు ప్రభుత్వం అందించిన విక్టరీకప్‌ను గురువారం పాఠశాల హెచ్‌ఎం కె.రామకృష్ణారావు బహుకరించారు. వారికి పీడీ బి.అప్పయ్య అభినందించారు.

టేబుల్ టెన్నిస్‌లో..

శ్రీకాకుళం స్పోర్ట్స్: జేకేసీ అధినేత జల్లేపల్లి గిరిధర్ విజయవాడలో ఫన్‌టైంక్లబ్ 70 ఏళ్ల పైబడిన కేటగిరిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీల్లో సత్తాచాటారు. ఈ మేరకు మొదటిస్థానం కైవశం చేసుకోవడంతో గురువారం శ్రీకాకుళంలో కాస్మోపాటిన్ క్లబ్ ప్రతినిధులు సన్మానించారు. కాస్మోపాలిటిన్ క్లబ్ ప్రతినిధులు జల్లేపల్లి గిరిధర్, మిక్స్‌డ్ డబుల్స్ స్లో విజేతగా నిలిచిన ఎంవీ సురేష్‌లను అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ సురంగి మోహనరావు, సంయుక్త కార్యదర్శి చింతాడ కృష్ణమోహన్, జి.సత్యంనాయుడు, ఎ.సెల్వన్, పి.గోగరాజు, ఎం.వి.రమణ, డోల తిరుమలరావు పాల్గొన్నారు.

విశాఖలో పోటీలకు కొవ్వాడమత్స్యలేశం జట్టు

రణస్థలం: జిల్లా స్థాయిలో గురువారం కోడురామూర్తి స్టేడియంలో జరిగిన ఆడుదాం ఆంధ్ర కీడల్లో వాలీబాల్ పోటీల్లో కొవ్వాడ మత్స్యలేశం యువకులు ప్రథమ స్థానంలో నిలిచారు. వాటీబాల్ పోటీలకు ఎనిమిది నియోజకవర్గాల నుంచి క్రీడాకా రులు హాజరయ్యారు. ప్రథమ స్థానం పొందిన కొవ్వాడ వాలీబాల్ టీమ్ ఈనెల 6 నుంచి 9వ తేదీ వరకూ విశాఖలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లనుందని ఎంఎస్ఎం సీహెచ్ రాము తెలిపారు.

వైసీపీని మట్టిలో కలపాలి

● జనసేన శ్రీకాకుళం ఇన్‌చార్జి పిసిని చంద్రమోహన్

జి.సిగడాం:బూటకపు వైసీపీప్రభుత్వాన్ని మట్టిలో కలపాలని జనసేన శ్రీకాకుళం ఇన్‌చార్జీ పిసిని చంద్రమోహన్ పిలుపునిచ్చారు. గురువారం జి.సిగడాంలో గాజుగ్లాసుతో జనసేన టీ పంపిణీ కార్యక్రమాన్నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జనసేన- టీడీపీ విజయదుందుబి మోగిస్తుందన్నారు.కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు మీసాల రవికుమార్, నియోజకవర్గ సమన్వయకర్త విశ్వక్సేన్, అర్జున్‌కుమార్, టీడీపీనాయకులు బాలబొమ్మ వెంకటేశ్వరరావు, డబ్బాడ అదినారాయణ, బగ్గు జ్ఞానేశ్వ రరావు, అప్పన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్రమోహన్

విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్య శిక్షణ: వీసీ

ఎచ్చెర్ల:డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ వర్సిటీలో చదువుతున్న పీజీ, ఇంజినీరింగ్ విద్యార్థులు ఉద్యోగాల ఎంపికకు నైపుణ్యం పొందేలా శిక్షణ ఇవ్వనున్నట్లు వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని తెలిపారు. గురువారం వర్సిటీలో ముంబైకు చెందిన సెంటర్ ఫర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ కన్సెల్టెన్సీ సంస్థ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా సీటీఎంసీ ప్రతినిధి చంద్రకాంత్‌వర్మ తమసంస్థ ద్వారా సాఫ్ట్‌స్కిల్స్, డిజిటల్ మార్కెటింగ్, ఇంటీరియల్ డిజైనింగ్, వెబ్ డిజైనింగ్, ఈ-కామర్స్, బిజినెస్ ఎనలెటిక్స్ డేటాసైన్స్‌లో శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ఐటీ రంగంలో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు విశాఖఐటీ సెజ్‌లోని సన్‌రైజ్ ఇంక్యుబేషన్ హబ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నామని వీసీ పేర్కొన్నారు. కాగా వర్సిటీలో రూ.35 కోట్లతో నిర్మిస్తున్న పరిపాలన భవనాన్ని వీసీ పరిశీలించారు. ఆమె వెంట రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, ఇంజనీర్ అంజిత్‌కుమార్ ఉన్నారు.

జిల్లాకు 40 మంది తహసీల్దార్లు.. 12 మంది ఎంపీడీవోలు

శ్రీకాకుళం,ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి):సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విజయనగరం, విశాఖ జిల్లాల నుంచి శ్రీకాకుళం జిల్లాకు 40 మంది తహసీల్దార్లు, 12 మంది ఎంపీడీవోలు బదిలీపై వస్తున్నారు. ఈ మేరకు ఎంపీడీవోలు గురువారం బదిలీ, నియామక ఉత్తర్వులను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ నుంచి అందుకున్నారు. తహసీల్దార్ల బదిలీల్లో ఇతర జిల్లాల నుంచి శ్రీకాకుళం కలెక్టరేట్ పరిపాలనాధికారిగా కేవీ ఈశ్వరరావు, కలెక రేట్‌లో సీసెక్షన్ సూపరింటెండెంట్‌గా బి.కూర్మనాథరావు, డి సెక్షన్ సూపరింటెండెంట్ ఎ.మనోరంజని, ఈసెక్షన్ సూపరింటెండెంట్‌గా పి.రామారావు, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ బీటీవీ రామారావు, ఆర్డీవో కార్యాలయం(శ్రీకాకుళం) డీఏవో ఆర్.నరసింహమూర్తి, టెక్కలి సబ్‌కలెక్టర్ డీఏవో బి.నాగరాజు, పలాస ఆర్డీవో కార్యాలయ డీఏవో జె.సూర్యనారాయణ, కేఆర్‌ఆర్‌సీ తహసీల్దార్ పి.లక్ష్మీదేవి(శ్రీకాకుళం), కేఆర్‌ఆర్‌సీ తహసీల్దార్ టెక్కలి జె.తారకేశ్వరి, గెయిల్ విభాగానికి ప్రత్యేక తహసీల్దార్ ఎంవీకేఎస్ రవి నియమితులయ్యారు.

జిల్లాకు బదిలీపై వస్తున్న తహసీల్దార్లు, ఎమ్పీడీఓలు..

మండలం	తహసీల్దార్	ఎమ్పీడీఓ
శ్రీకాకుళం	బీవీ రాణి	ఎం.సతీష్
గార	డి.వీరభద్రరావు	బి.కల్యాణి
ఆమదాలవలస	కె.వేణుగోపాల్	
పొందూరు	ఎం.పాల్‌కిరణ్	సీహెచ్ సూర్యనారాయణ
సరబుజ్జిలి	వి.శ్యామ్‌కుమార్	ఎం.రత్నం
బూర్జ	ఎస్‌వీ అంబేద్కర్	
నరసన్నపేట	ఎల్.రామారావు	
పోలాకి	ఎస్ఎల్‌వీ ప్రసాద్	
జలుమూరు	సీహెచ్ నాగమ్మ	
సారవకోట	పి.భాగ్యవతి	
ఎచ్చెర్ల	జె.రమేష్‌బాబు	
రణస్థలం	పి.కనకారావు	
జి.సిగడాం	బి.రవికుమార్	కె.రామకృష్ణరాజు
లావేరు	పి.ఆదిలక్ష్మి	జి.భాస్కరరావు
టెక్కలి	ఆర్.బాలమురళీకృష్ణ	కె.విజయలక్ష్మి
కోటబొమ్మాళి	ఎం.సురేష్	వై.పద్మజ
సంతబొమ్మాళి	జి.సత్యనారాయణ	
నందిగాం	వి.పద్మావతి	
పాతపట్టణం	వైఎస్‌వీవీ ప్రసాదరావు	కె.వెంకన్నబాబు
హిరమండలం	బి.నాగజ్యోతి	డీడీ స్వరూపారాణి
కొత్తూరు	ఎంవీవీ ప్రసాద్	పి.తివిక్రమరావు
ఎల్ఎన్ పేట	ఎస్.రాణీఅమ్మాజీ	జి.గిరిబాల
మెళియాపుట్టి	కె.జానకమ్మ	
పలాస	ఎస్ఎస్‌వీఎస్ నాయుడు	కేఎస్ కొండలరావు
మందస	ఎల్.తిరుమలాంబ	
వజ్రపుకొత్తూరు	పి.లచ్చుపాత్రుడు	
ఇచ్ఛాపురం	ఎంవీ అప్పారావు	వైపీ రాజేంద్రప్రసాద్
కవిటి	ఎం.లక్ష్మి	
కంచిలి	ఎం.శ్రీను	

అధికారులు బాధ్యతల స్వీకరణ

సాధారణ ఎన్నికలనేపథ్యంలో జిల్లాలో ఇప్పటివరకూ పనిచేస్తున్న రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం బదిలీలు చేసింది. ఈ మేరకు బదిలీలపై వెళ్తున్న వారికి వీడ్కోలు పలికారు. కొత్తగా నియమితులైన వారు గురువారం బాధ్యతలు స్వీకరిస్తున్నారు.

డీఎస్పీల బదిలీలు

శ్రీకాకుళం క్రైం:శ్రీకాకుళందిశ డిఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఎస్.వాసుదేవ్‌ను విజయనగరం దిశ డీఎస్పీగా, విజిలెన్స్, ఎన్‌ఫోర్‌మెంట్ నుంచి ట్రాఫిక్ ఎటాచ్‌మెంట్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్‌జీవీ ప్రసాదరావును విశాఖపట్నం ఏసీపీగా టాస్క్ ఫోర్స్‌కు బదిలీ అయ్యారు. విజయనగరం దిశ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావును శ్రీకాకుళం దిశ డీఎస్పీగా, విశాఖపట్నం టాస్క్ ఫోర్స్ డీఎస్పీ ఎ.త్రినాథరావును శ్రీకాకుళం ఎస్‌బీ డీఎస్పీగా బదిలీ చేస్తూ డీజీపీ కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. అలాడే శ్రీకాకుళం ఎస్‌బీ డీఎస్పీ కె.బాలరాజును విశాఖపట్నం మెరైన్ డీఎస్పీగా బదిలీచేశారు.

ఎంపీడీవోలుగా...

● **గార:**గారఎంపీడీవోగా బి.కల్యాణి బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లా నుంచి ఇక్కడకు ఆమె వచ్చారు.అలాగే తహసీల్దార్ జెన్ని రామారావు, ఎంపీడీవో ఎస్.రమణయ్యలకు విజయనగరం జిల్లాకు బదిలీ చేశారు. గార ఎస్ఐగా కృష్ణప్రసాద్‌ను నియమించారు.

● **సరుబుజ్జిలి:**సరుబుజ్జిలి ఎంపీడీవోగా ఎం.రత్నం బాధ్యతలు చేపట్టారు. విజయనగరం జిల్లా నుంచి ఇక్కడకు బదిలీపైరాగాఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన మురళీమోహన్‌కుమార్ విశాఖ జిల్లాకు బదిలీపై వెళ్లారు.

● **జి.సిగడాం:**జి.సిగడాం ఎంపీడీవోగా కె.రామకృష్ణరాజు బాధ్యతలు చేపట్టారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన కె.నిశ్చల విజయనగరం జిల్లా గరివిడి ఎంపీడీవో కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

● **శ్రీకాకుళం అర్బన్:**శ్రీకాకుళం ఎంపీడీవోగా ఎం.సతీష్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీవో రామ్మోహన్‌రావుకు బదిలీపై వెళ్లారు.

● **టెక్కలి:** ఎంపీడీవోగా కె.విజయలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె పార్వతీపురం మన్యం జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన చింతాడ లక్ష్మీ భాయి విజయనగరం జిల్లాకి బదిలీ అయ్యారు.

● **కోటబొమ్మాళి:** ఎంపీడీవోగా ఎచ్చెర్ల పద్మజ బాధ్యతలు స్వీకరించారు. ఈమె విజయనగరం జిల్లా కొత్తవలస నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన కె.ఫణీంద్రకుమార్ పార్వతీపురం జిల్లా సాలూరుకు బదిలీ అయ్యారు.

● **కొత్తూరు:** కొత్తూరు ఎంపీడీవోగా పి.త్రివిక్రమరావు గురువారం విధుల్లో చేరారు. పార్వతీపురం మన్యం జిల్లా మెంటాడ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. సిబ్బంది సహకారంతో మండల అభివృద్ధికి పాటుపడతానన్నారు.

● **హిరమండలం:**హిరమండలం ఎంపీడీవోగా డి.స్వరూపరాణి బాధ్యతలు స్వీకరి చారు. ఈమె విశాఖ జిల్లా పద్మనాభం మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు పని చేసిన బి.శ్రీదేవి విజయనగరం జిల్లాకు బదిలీ అయ్యారు.

● **మందస:**ఎంపీడీవోగా ఎ.రఘుపతిరావు బాధ్యతలుచేపట్టారు. ఈ కార్యాలయంలో ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న రఘుపతిరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడపనిచేసిన వి.తిరుమలరావును విజయనగరం జిల్లా జామి బదిలీఅయ్యారు. తహసీల్దార్ బి.పాపారావు మునగపాక బదిలీ అయ్యారు.

తహసీల్దారులుగా..

● **లావేరు:**లావేరు తహసీల్దార్‌గా పి.ఆదిలక్ష్మి నియమితు లయ్యారు. విజయనగరం జిల్లా డెంకాడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆమె లావేరు బదిలీపై వచ్చారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ ఎస్.దిలీప్‌చక్రవర్తికి విజయనగరం జిల్లా తెర్లాం తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు.

● **గార:** గార తహసీల్దార్‌గా డి.వీరభద్రరావు నియమితులయ్యారు.ఆయన విశాఖపట్నం జిల్లా నుంచి ఇక్కడకు వస్తున్నారు. ఇక్కడ ఇప్పటివరకు తహసీల్దార్‌గా పనిచేసిన జెన్ని రామారావు విశాఖ జిల్లాకు బదిలీ అయ్యారు.

ఎస్ఐలుగా..

● **ఆమదాలవలస:**ఆమదాలవలస ఎస్ఐ-1గా వెంకటేష్ బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం సీసీఎస్ నుంచి బదిలీపై వచ్చారు. గతంలో ఇక్క డ ఎస్ఐ-1గా విధులు నిర్వహించిన వై.కృష్ణ విశాఖపట్నం బదిలీపై వెళ్లారు.

● **రణస్థలం :** జేఆర్‌పురం ఎస్ఐగా కె.గోవిందరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ జి.రాజేష్ బదిలీ పై కంచిలి వెళ్ళారు. ఇచ్ఛాపురం టౌన్ నుంచి గోవిందరావు బదిలీపై జేఆర్‌పురం వచ్చారు.

ఖైదీలు న్యాయ సహాయం పొందవచ్చు

●జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

గార: అవసరమైన ఖైదీలు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి రెడ్డి సన్యాసినాయుడు తెలిపారు. గురువారం అంపోలు సమీపంలోని జిల్లా జైలులో ఖైదీలతో ఆయన మాట్లాడారు. జైలులో ఖైదీలకు అందజేస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ఎస్.నబీఖాన్, జైలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



గార: జిల్లా జైలులో రికార్డులను పరిశీలిస్తున్న సన్యాసినాయుడు

బాలలకు పోషకాహారం అందించాలి

అరసవల్లి: బాలలకు మంచి పోషకాహారం అందించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. గురువారం అరస వల్లిలోని బాలసదన్, శిశుగృహాలను సందర్శించారు. కార్యక్రమంలో బాలసదన్ సూపరింటెండెంట్ పుణ్యవతి, మేట్రిన్ సుజాత, శిశుగృహ మేనేజర్ నరేష్, సంఘసేవకుడు రాంబాబు పాల్గొన్నారు.

రైతులకు మేలు చేయని బడ్జెట్

గార: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంట్‌కు సమర్పించిన బడ్జెట్ రైతులకు మేలు చేయదని, ప్రవేశపెట్టిన అంశాల్లో రైతులకు క్షేత్రస్థాయిలో అందుబాటులో లేవని టీడీపీ నాయకుడు బడగల వెంకట అప్పారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు అమలు జరగకపోవడంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందుకోలేక పోతున్నారని తెలిపారు.

ఎస్ఎస్ఏ జేఏసీ కార్యవర్గం ఎన్నిక

ఇచ్ఛాపురం:స్థానిక ఎంఆర్‌సీకార్యాలయంలో సమగ్రశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) జేఏసీకార్యవర్గం ఎన్నిక బుధవారం జరిగింది. అధ్యక్షుడిగా బడియా గణేష్, కార్యదర్శిగా ఆశి రవికు మార్, ఉపాధ్యక్షులుగా చల్ల సత్యనారాయణ, జాయింట్ సెక్రట రీగా ఎస్.సూర్యం, ట్రెజరర్‌గా ఎన్.యాదవ్ ఎన్నికయ్యారు.

అగ్నిప్రమాద బాధితునికి పరామర్శ

కంచిలి: తలతంపరలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో రజనీ సాహు ఇల్లు కాలిపోవడంతో ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆ కుటుంబాన్ని పరామర్శించారు.ఈసందర్భంగా బియ్యంబస్తా, కొంత నగదును అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పూర్ణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బీ గ్రేడ్ ఆర్టిస్టులుగా ఇద్దరు ఎంపిక

ఇచ్ఛాపురం: పట్టణంలోని స్వేచ్ఛావతి నృత్య తరంగణికి చెం దిన కళాకారులు మంగి దివ్య, కరణంకుమార్ హైదరాబాద్ దూరదర్శన్ కేంద్రం గత ఏడాది ఆగస్టులో నిర్వహించిన కూచిపూడి శాస్త్రీయ నృత్య ఆడిషన్‌లో ప్రతిభ కనబరిచారు. ఈ మేరకువారికిఆడిషన్ కమిటీ బుధవారం బీ గ్రేడ్ ఆర్టిస్టులుగా ఎంపికచేసింది. దీంతో వారికి స్వేచ్ఛావతి నృత్య తరంగణి అకాడమీ అధ్యక్షుడు కె. గోవింద్ అభినందించారు.

సాగర జల దీక్ష విజయవంతంచేయాలి

ఇచ్ఛాపురం: సీపీఎస్‌కు వ్యతిరేకంగా ఈనెల నాలుగో తేదీన జరిగే సాగర జల దీక్ష విజయవంతం చేయాలని ఏపీ సీపీఎస్సీఏ జిల్లా ఉపాధ్యక్షుడు బి.శంకరం కోరారు. ఈమేరకు గురువారం ఇచ్ఛాపురం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సాగరదీక్షకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.కార్యక్రమంలో ఏపీ సీపీఎస్సీ మండల ప్రధాన కార్యదర్శులు కె.చంద్రశేఖరం, కె. భవానీ ప్రసాద్,జిల్లా సెక్రటరీ సోమేశ్వరరావు,యూటీఎఫ్ మండల మునిసిపల్ అధ్యక్షుడు శ్రీను, ఏపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్.రాజు పాల్గొన్నారు.

ఉత్తమ దర్శకుడిగా రామలింగస్వామి

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం రంగస్థలం కళాకారుల సమాఖ్య గౌరవాధ్యక్షుడు ఎల్.రామలింగస్వామికి ఉత్తమ దర్శకత్వం అవార్డు లభించింది. ఒంగోలులో పీఎంకేఎం కళాపరిషత్ ఆధ్వర్యంలో జరిగిన నాటక పోటీల్లో శ్రీకాకుళం శ్రీకళాసమితి ఆధ్వర్యంలో కర్మఅన్న నాటికను ప్రదర్శించారు. ఈ నాటికకు దర్శకత్వం వహించిన ఎల్.రామలింగస్వామికి ఉత్తమ దర్శకత్వం, కలగ గణేష్ యాదవ్‌కు ఉత్తమనటుడిగా సినీనటుడు మురళీమోహన్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు రామలింగస్వామి తెలిపారు.

జన ఔషధ కేంద్రం ప్రారంభం

లావేరు: వెంకటాపురంలో డీసీసీబీ ఆధ్వర్యంలో గురువారం ఆ బ్యాంకు చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌ప్రధాన మంత్రి జన ఔషధ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పీఎం జన ఔషధ కేంద్రం ద్వారా 50శాతం రాయితీతో మందులు విక్రయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో వరప్రసాదరావు, డివిజనల్ కోఆపరేటివ్ అధికారి ఎం.చంటిబాబు, లావేరు పీఏసీఎస్ చైర్మన్ బూరాడ చిన్నారావు, మండల ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, సీఈవో మీసాల సత్యన్నారాయణ పాల్గొన్నారు.

స్థలాలు స్వాధీనం చేయండి

హిరమండలం:హిరమండలంలోని కోరాడ రెవెన్యూ పరిధిలో ఉన్న తమ స్థలాల్లో వంశధార రిజర్వాయర్ పనుల్లో భాగంగా ఎత్తిపోతల పథకానికి సంబంధించి మట్టిని తీసుకువచ్చివేస్తున్నారని, దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పి.నాగేశ్వరరావు, కొయ్యాన అప్పలస్వామి, రావాడ సింహాచలం, ముద్దాడ శిమ్మయ్యదాలయ తదితరలు అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ మురళీమోహన్ రావుకు గురువారం ఫిర్యాదు చేశారు. ఎటువంటి సమాచారం లేకుండా మట్టిని మా సొంత స్థలాల్లో వేస్తున్నారని, ఆవేదన వ్యక్తం చేశారు. పరిశీలించి స్థలాలు అప్పగించాలని కోరారు.

నూతన కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైం: నూతన కలెక్టర్‌గా నియమితులైన డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను ఎస్పీ జీఆర్ రాధిక గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. స్థానిక ఓ ప్రైవేట్ హోటల్‌లో కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఎస్పీతో పాటు డిఎస్పీ వై.శృతి తదితరులు ఉన్నారు.

నేడు ఆదిత్యాలయ పాలకమండలి సమావేశం

అరసవల్లి: అరసవల్లిలో ఈనెల 16న జరిగే రథ సప్తమి ఉత్సవ ఏర్పాట్లకు సంబంధించి చర్చించేందుకు ఆలయ పాలక మండలి సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లుఈవో హరిసూర్యప్రకాష్ తెలిపారు. పాలకమండలి చైర్మన్ ఇప్పిలి జోగిసన్యాసిరావు అధ్యక్షతన జరిగేసమావేశంలో ఏర్పాట్లకు సంబంధించి సలహాలు, సూచనలు అందజేయాలని కోరారు.

రేపు డయల్ యువర్ యూనివర్సిటీ

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో శనివారం డయల్ యువర్ యూనివర్సిటీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీ, అనుబంధ పీజీ, డిగ్రీ కళాశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు తమ సందేహాలు, సమస్యలను ఫోన్ ఇన్‌లైవ్‌లో తెలియజేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు.ఉదయం10 నుంచి11 గంటల వరకు విద్యార్థులు 82478 61919 నెంబరుకు ఫోన్ చేయాలని తెలిపారు.

4న సహస్ర కోలాటం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ మునిసిపల్ గ్రౌండ్‌లో ఈనెల నాలుగో తేదీన సహస్ర కోలాటం నిర్వహించనున్నట్లు జిల్లా కళింగ వైశ్య మహిళాసంఘం అధ్యక్ష, కార్యదర్శులు పద్మజ, శాంతిప్రియలు తెలిపారు. గురువారం శ్రీకాకుళంలో వారు విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో తొలిసారిగా 30 గ్రామాల నుంచి ఎంపికచేసిన 1008మంది కళింగ వైశ్య మహిళలతో ఒకే వేషాధారణలో రికార్డు స్థాయిలో కోలాటం నృత్యం చేసేందుకు ఇంటర్నేషనల్ వండర్ బుక్ఆఫ్ రికార్డు వారికి దరఖాస్తు చేసుకున్నామని చెప్పారు.అనంతరం సహస్ర కోలాటం కరపత్రాలను ఆవిష్కరించారు కార్యక్రమానికి వి జ్యూయిలర్స్‌తో పాటు కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు 50 వేలు ఆర్థిక సాయంచేశారు. సమావేశంలో నేతలు కోణార్క్‌శ్రీను, కోరాడ హరగోపాల్, ఊన్న నాగరాజు, తంగుడు జోగారావు, కోరాడ రమేష్, బాబ్జి, గుడ్ల దామోదర్‌రావు, శ్రీదేవి, జ్వాల, రాజశ్రీ, రాణి,ధనలక్ష్మి పాల్గొన్నారు.

దుకాణాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

అరసవల్లి: జిల్లాలోని అన్ని దుకాణాలు, సంస్థలు తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఉప కార్మిక కమిషనర్ ఎస్‌డీవీ ప్రసాదరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ దుకాణాల- సంస్థల చట్టం ప్రకారం మీసేవా, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు. కార్మికులు ఉన్నా, లేకున్నా సరే రిజిస్ట్రేషన్ తప్పనిసరని తెలిపారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేయించుకుని, రెన్యూవల్ చేయించుకోకపోతే, వెంటనే చేయించుకోవాలని పేర్కొన్నారు. ఈనెలాఖరులోగా రిజిస్ట్రేషన్ చేయించుకోకపోతే జరిమానా విధించనున్నట్లు తెలిపారు.